సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 24 । నవంబర్ । 2023



వికారాబాద్ ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం

న్యూస్‌రీల్

పోలింగ్ పారదర్శకంగా నిర్వహించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి



ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: పోలింగ్ విధులను సమష్టి బాధ్యతతో చేపట్టాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో పోలింగ్ నిర్వహణపై అదర్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ ఏపీఓలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో వికారాబాద్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి రాహుల్ శర్మ, డీహెచ్ఎస్ ఓ చక్రపాణి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి లక్ష్మీనారాయణ, ఎంపీడీవో సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలను సిద్ధం చేయండి

పరిగి: స్ట్రాంగ్ రూమ్ పరిసరాల్లోకి ఎవరూ రాకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని స్ట్రాంగ్ రూంను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 30న ఎన్నికలు జరగనున్నందున ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. ఎన్నికలకు ఈవీఎం, వీవీ ప్యాట్స్‌లను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఓ విజయకుమారి పాల్గొన్నారు.

తూకంలో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

తూనికల శాఖ జిల్లా అధికారి రియాజ్



పెద్దేముల్‌లోని పత్తి దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

పెద్దేముల్: పత్తి తూకంలో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా తూనికల అధికారి రియాజ్ హైమద్‌ఖాన్ హెచ్చరించారు. బుధవారం రాత్రి పెద్దేముల్ పత్తి మిల్లులు, దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు చేశారు. రెండు రోజుల క్రితం సాక్షి దినపత్రికలో కాంటాల్లో మోసం.. ధరల్లో వ్యత్యాసం అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు జిల్లా అధికారులు స్పందించారు. పెద్దేముల్‌లోని రెండు పత్తి కొనుగోలు దుకాణాల్లో ఎలక్ట్రానిక్ కాంటాను పరిశీలించి మోసాలు జరుగుతున్నట్లు గుర్తించారు. అట్టి దుకాణ యజమానులకు రూ.లక్ష వరకు జరిమానా వేయనున్నట్లు తూనికల అధికారి రియాజ్ గురువారం తెలిపారు.

ఒకే విడతలో దళితబంధు

నేనే వికారాబాద్‌కు వచ్చి ప్రారంభిస్తా




ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్

- అనంతగిరిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తం
- పాలమూరు ప్రాజెక్టులో మీ వాటా మీకున్నది
- ఏడాదిలో వికారాబాద్‌కు నీళ్లిచ్చే బాధ్యత నేను తీసుకుంటా
- కాలువలు తవ్వుడు ఒక్కటే మిగిలింది
- ఐటీ రంగాన్ని వికారాబాద్ వరకు విస్తరిస్తం
- నియోజకవర్గంపై సీఎం కేసీఆర్ హామీల వర్షం

వికారాబాద్: ''దేశంలో ఏ ముఖ్యమంత్రి, ఏ ప్రధాన మంత్రి కూడా ఆలోచన చేయలేదు.. దళితులను ఓటు బ్యాంకుగానే వాడుకున్నరు.. దళితబంధు హుజురాబాద్‌లో మొదలు పెట్టినం.. ఫలితాలు బ్రహ్మాండంగా వచ్చినయ్.. అక్కడ దళిత వాడలాగా లేదు.. ధనిక వాడలాగా అయ్యింది.. వికారాబాద్ ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గం.. ఇక్కడ దళిత బిడ్డలు ఎక్కువ.. నేను మిమ్మల్ని ఒక్కటి కోరుతా ఉన్న.. మీరు ఆనంద్‌ను గెలిపియ్యండి.. వికారాబాద్‌కు ఒకే విడతలో దళితబంధు పెడతా.. నేనే వచ్చి పథకాన్ని ప్రారంభిస్తా''.. అని సీఎం కేసీఆర్ అన్నారు. గురువారం వికారాబాద్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొని ప్రసంగించారు. వికారాబాద్ నియోజకవర్గానికి హామీల వర్షం కురిపించారు. దళితబంధు ఒకేసారి ఇస్తం.. నేనే వచ్చి ప్రారంభిస్తా.. ఈ దెబ్బతోని వికారాబాద్ దళిత కుటుంబాలన్నీ ధనిక కుటుంబాలు అయితయ్.. ఎవ్వరో ఎల్లయ్యగాడు గెలిస్తే వచ్చేదేమీలేదు.. ఆనంద్ గెలిస్తే ప్రతి దళిత కుటుంబం బంగారు కుటుంబం అయితది.. మీరందరు నా మెసేజ్‌ను ప్రతి గడపకూ తీసుకెళ్లి ఆనంద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మీ బలమైన కోరిక వికారాబాద్ జిల్లా.. ఈ కలను సాకారం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని అన్నారు. ఇక్కడ డిగ్రీ కాలేజీ కూడా లేకుండే.. ఆనందే పట్టుబట్టి చేయించిండు.. మెడికల్ కాలేజీ కూడా మాకు కావాలె అని చెప్పిండు.. ఒక్క మెడికల్ కాలేజే కాదు.. ఒక నర్సింగ్ కాలేజీ వస్తది.. పారామెడికల్ కోర్సులు వస్తయి.. 450 పడకల ఆస్పత్రి వస్తది.. మీరు చిన్న చిన్న జబ్బులకు హైదరాబాద్ కూడా పోవాల్సిన అవసరం ఉండదని కేసీఆర్ అన్నారు. వికారాబాద్ హైదరాబాద్‌కు సమీప ప్రాంతం.. రాబోయె రోజుల్లో ఐటీని వికారాబాద్ వరకు విస్తరిస్తం.. మీ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని అని అన్నారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తయ్యింది.. మొన్ననే ప్రారంభించిన.. మీరు చూసింద్రూ.. వికారాబాద్‌కు కూడా నీళ్లు వస్తుండే.. రాకుండా జేసింది.. ఈ కాంగ్రెసోల్లే.. నూటతొంభైయారు కేసులేసింద్రు.. అవన్ని అధిగమించినం.. ప్రాజెక్టు పూర్తి చేసినం.. ఏడాదిలో వికారాబాద్‌కు నీళ్లిచ్చే బాధ్యత నేను తీసుకుంట.. పాలమూరు ప్రాజెక్టులో మీ వాట మీకున్నది.. కాలువలు తవ్వుడు ఒక్కటే మిగిలింది. ఏడాదిలో కాలువలు పూర్తి చేసి వికారాబాద్, పరిగి, తాండూరు, చేవెళ్లకు నీళ్లిస్తం.. మీ ప్రాంతం భూములు మంచివి, బంగారం లాంటి పంటలు పండుతయ్.. మీరు బాగు పడతారు అని కేసీఆర్ అన్నారు. వీటితో పాటు అనంతగిరిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం..అనంత పద్మనాభ స్వామి దేవాలయాన్ని కూడా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. వీటితో పాటు ఆనంద్ అడిగినవన్నీ చేస్తం.. కానీ మీరు నాకొక్క మాటివ్వాలే.. మీ ప్రాంత వాసి.. మీ బిడ్డ.. ఎన్నో రోజుల నుంచి భార్యభర్తలు మీ ప్రాంతానికి సేవ చేస్తున్నరు.. మంచి వ్యక్తి.. నిగర్వి అయిన ఆనంద్‌ను గెలిపించాలని కోరారు.

ఇది కేసీఆర్ అడ్డ: ఎంపీ రంజిత్‌రెడ్డి

పక్క రాష్ట్రం వాళ్లు ఇక్కడికి వచ్చి ఏవేవో చెబుతున్నారు.. అక్కడ ఒక్క మంచి పనైనా చేసింద్రా.. అని కర్ణాటక కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. ఇక్కడ కేసీఆర్ ఎంతో చేశారు.. సమ్మిళిత, సమగ్ర, సంతులిత అభివృద్ధి చేసి చూయించిన ఘనత మన కేసీఆర్‌కే దక్కుతుంది అని అన్నారు. ఇది కేసీఆర్ అడ్డ.. ఇక్కడ ఎవరో వచ్చి ఏదేదో మాట్లాడితే చూసి ఊరుకుంటారా.? అని ఆయన అన్నారు. సీఎం కేసీఆర్ సంపదను సృష్టించి మనకు పంచారని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

వికారాబాద్ అప్పుడు ఎట్లుండే: ఎమ్మెల్యే ఆనంద్



మాట్లాడుతున్న ఆనంద్

తెలంగాణ రాకముందు వికారాబాద్ ఎట్లుండే.. బీఆర్ఎస్ వచ్చాక ఇప్పుడు ఎట్ల ఉందని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. తెలంగాణ రాకపోతే.. కేసీఆర్ సీఎం కాకపోతే.. మన చిరకాల వాంఛ వికారాబాద్ జిల్లా అయ్యేదా..? అని అన్నారు. గద్వాల జోన్‌లో ఉన్న వికారాబాద్‌ను చార్మినార్ జోన్‌లో కలపటం వల్ల ఎంతో మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. వికారాబాద్‌కు ఎడ్యుకేషన్ హబ్‌గా పేరుండె.. కానీ ఇక్కడ కనీసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూడా లేకుండె.. ఒక్క డిగ్రీ కళాశాలనే కాదు.. రూ. 230 కోట్లతో మెడికల్ కాలేజీ, రూ. 15 కోట్లతో ఆయుష్ ఆస్పత్రి, 50 పడకల ఐసీయూ ఆస్పత్రి, డయాలసిస్ కేంద్రం.. రూ. 96 కోట్లతో రైల్వే బ్రిడ్జి.. వికారాబాద్ మున్సిపల్ అభివృద్ధికి రూ. 60 కోట్లు ఇచ్చిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ధారూరులో జూనియర్ కాలేజీ, మోమిన్‌పేటలో మైనార్టీ జూనియర్ కాలేజీ, వికారాబాద్‌లో క్రిస్టియన్ శ్మశానవాటికకు స్థలం ఇవ్వాలని ఆయన కోరారు. అనంతగిరిని పర్యాటక కేంద్రంగా, అనంత పద్మనాభ స్వామి ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీఎంను కోరారు. వికారాబాద్ చుట్టూ రింగ్ రోడ్డు నిర్మించాలన్నారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు నుంచి సాగునీరు ఇవ్వాలని కోరారు. గెలిచిన నాటి నుంచి ప్రజల్లోనే ఉంటున్న.. ఇకపై కూడా అందుబాటులో ఉంటా.. గెలిపించి మరోసారి సేవ చేసే అవకాశం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు. తెలిసి తెలియక చేసిన తప్పులేమైనా ఉంటే మన్నించాలని ఆనంద్ అన్నారు.



బాస్‌పల్లిలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

దోమ: బీఆర్ఎస్‌ను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి కోరారు. గురువారం దోమ మండలం మోత్కూర్, గొన్యానాయక్ తండా, ఖమ్మం నాచారం, మైలారం, గొడుగోనిపల్లి, బాస్‌పల్లి, బొంపల్లి, దోర్నాల్‌పల్లి, దొంగఎన్కేపల్లి, గూడూర్, శివారెడ్డిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో తెలంగాణ అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. కాంగ్రెసోళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. పదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాలను చూసి ప్రజలు ఆశీర్వదించాలన్నారు. తనను భారీ మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మయ్య ముదిరాజ్, కో ఆప్షన్ సభ్యుడు ఖజాపాష, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, యూత్ అధ్యక్షుడు మశ్చేందర్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు పద్మ, యాదయ్య సాగర్, ఎంపీటీసీలు రాఘవాపురం రాములు, ఉప సర్పంచ్ రఫీక్ పాష పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే కర్ణాటక కష్టాలే

- అక్కడ వ్యవసాయానికి 5గంటల కరెంటే
- బీఆర్ఎస్ వస్తేనే రైతుబంధు, రైతు బీమా
- తాండూరు అభ్యర్థి రోహిత్‌రెడ్డి



అవ్వా రావాలి.. ఓటు వేసి ఆశీర్వదించాలి.. వృద్ధులను కోరుతున్న రోహిత్‌రెడ్డి

బషీరాబాద్: కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే కన్నడ రైతులు పడుతున్న కరెంటు కష్టాలు తెలంగాణకు తప్పవని బీఆర్ఎస్ తాండూరు అభ్యర్థి, ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అన్నారు. బషీరాబాద్ మండలంలోనే మా సొంతూరు ఇందర్‌చెడ్ ఉందని, ఈ గ్రామానికి పక్కనే కర్ణాటకలోని హయ్యాళం ఉందని అక్కడ వ్యవసాయానికి ఎన్ని గంటలు కరెంటు ఇస్తున్నారో చూసి రావాలని రైతులను కోరారు. గురువారం మండలంలోని కంసాన్‌పల్లి, గొట్టికఖుర్దు, గొట్టిగకలాన్, బాద్లాపూర్, బాద్లాపూర్ తండా, కుప్పన్‌కోట్, కాశీంపూర్ తదితర గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద సమావేశాల్లో పాల్గొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిందన్నారు. రైతుబంధు, రైతు బీమా ఇస్తున్నట్లు తెలిపారు. పొరపాటున కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఉచిత కరెంటు, సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని అన్నారు. ఐదేళ్ల కాలంలో తాండూరు అభివృద్ధికి రూ.1,680 కోట్లు తెచ్చానని వివరించారు. బషీరాబాద్ మండలాన్ని రూ.68.18 కోట్లతో అభివృద్ధి చేశానని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ, 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి రూ.10 కోట్లు తెచ్చినట్లు చెప్పారు. ఏకాంబరి ఆలయ అభివద్ధికి కోటి, మండల కేంద్రం అభివృద్ధికి రూ.3 కోట్లు ఇచ్చానన్నారు. మల్కన్‌గిరి, గంగ్వార్, పర్శ్యానాయక్ తండాలను కొత్త జీపీలుగా చేశామని పేర్కొన్నారు. మండలంలోని ప్రతి గ్రామానికీ రూ.50లక్షలు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని అన్నారు. మరోసారి ఓటేసి తనను ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమీషన్లు ఇస్తేనే ప్రభుత్వ పథకాలు

- గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకుల దందాలు
- అభివృద్ధిని పట్టించుకోని అధికార పార్టీ నేతలు
- కాంగ్రెస్ తాండూరు అభ్యర్థి మనోహర్‌రెడ్డి

యాలాల: అధికార పార్టీ నాయకులకు కమీషన్లు ఇస్తేనే పేదలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని కాంగ్రెస్ పార్టీ తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం మండలంలోని సంగెంకుర్దు, హాజీపూర్, కిష్టాపూర్, దేవనూరు, గోరేపల్లి, విశ్వనాథ్‌పూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు అభివృద్ధిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రతి పనికి కమీషన్ తీసుకొని, సామాన్యులు, పేదలను ఇబ్బందుల గురి చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను అమలు చేసి చూపిస్తామన్నారు. అలాగే తాండూరు నియోజకవర్గంలోని సహజ వనరులను పరిరక్షిస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం యువతను, నిరుద్యోగులను మోసం చేసిందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీతో పాటు గ్రూప్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసిందన్నారు. త్వరలో ఇందిరమ్మ రాజ్యం రావడం ఖాయమన్నారు. రానున్న ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణాగౌడ్, సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు అమృతప్ప, కాంగ్రెస్ నేతలు హన్మంతు, మొగులప్ప, ఖాసీం, బలరాం, ఎల్లప్ప, పరమేష్, కోస్గి రవిగౌడ్, శ్రీశైలం, వడ్ల శ్రీను, హన్మ్యనాయక్, శంకర్ నాయక్, మాసుల ఖాసీం పాల్గొన్నారు.



సంగెంకుర్దు రోడ్ షోలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్‌లో హస్తం జోష్



ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

కొడంగల్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తరఫున గురువారం కొడంగల్‌లో కాంగ్రెస్ నేతలు భారీ ఊరేగింపు నిర్వహించారు. కొడంగల్, కొండారెడ్డిపల్లి, గుండ్లకుంట, బూల్కాపూర్, పాత కొడంగల్, ఐనన్‌పల్లి గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వచ్చారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చేతి గుర్తుకు ఓటు వేసి రేవంత్‌ను గెలిపించాలని నినాదాలు చేశారు. కళాకారుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి, రేవంత్ సోదరుడు కృష్ణారెడ్డి మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు ప్రశాంత్, కృష్ణంరాజు, దాము, నయీమ్, మురహరి వశిష్ఠ, అనితారెడ్డి, రాము, భీంరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలిస్తేనే సంక్షేమం

- పరిగి అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి

దోమ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఆ పార్టీ పరిగి అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం దోమ మండలం దోర్నాల్‌పల్లి, బాస్‌పల్లి, బొంపల్లి, బొంపల్లితండా, దొంగఎన్కేపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హస్తం పార్టీని ఆదరించాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. అధికార బీఆర్ఎస్‌కు రోజులు దగ్గర పడ్డాయని విమర్శించారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తే సహించేది లేదన్నారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ప్రజలంతా మా వైపే ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచులు అశోక్‌రెడ్డి, రాజు, అమృతమ్మ, సురేశ్, ఎంపీటీసీలు రాములు, నాయకులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్, అంతిరెడ్డి, చంద్రశేఖర్, రాములు, భాస్కర్, కలీం ఖాన్, హైమద్, ఫైమొద్దీన్, యాదయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన టీడీపీ నేత

టీడీపీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, దొంగఎన్కేపల్లి వార్డు సభ్యుడు సంజీవ్ కుమార్, గ్రామ కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, దమ్మి బుచ్చన్న, ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు వెంకటేశ్, బీఆర్ఎస్ గ్రామ ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి తోపాటు పలువురు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి రామ్మోహన్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



బొంపల్లిలో ప్రజలకు నమస్కారం చేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

క్లుప్తంగా

కారుకు ఓటేసి.. కొప్పలను గెలిపించండి



ప్రచారం చేస్తున్న ప్రతిమారెడ్డి

కుల్కచర్ల: సబ్బండ వర్గాల ఉన్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని పరిగి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొప్పుల మహేశ్ రెడ్డి సతీమణి ప్రతిమారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి జరిగిందని, మరింత వృద్ధి చెందాలంటే బీఆర్‌ఎస్‌ను మరోసారి ఆదరించాలని కోరారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యేగా మహేశ్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, నాయకులు హరికృష్ణ, శ్రీశైలం, బిచ్చయ్య, సిద్దులు, బాలు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మంచిరెడ్డి గెలుపుకోసం మౌనికారెడ్డి ప్రచారం



బాటసింగారంలో మౌనికారెడ్డి ప్రచారం..

అబ్దుల్లాపూర్‌మెట్: ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కోడలు మౌనికారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలో ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను చూసి కారు గుర్తుకు ఓటు వేసి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా మంచిరెడ్డిని గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ లతాశ్రీ పాల్గొన్నారు.



కాలె యాదయ్య, బీఆర్‌ఎస్ | కేఎస్ రత్నం, బీజేపీ | భీంభరత్, కాంగ్రెస్

చేవెళ్ల బాద్‌షా ఎవరో?

కాంగ్రెస్ కంచుకోటలో త్రిముఖ పోటీ!

- హ్యాట్రిక్ విజయంపై యాదయ్య నజర్
- 'హస్త'గతానికి భీం పట్టు
- కమలం 'రత్నం' వికసించేనా?

నవాబుపేట: గత రెండు పర్యాయాలుగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రమంతా ఒకవైపు పవనాలు వీస్తే.. చేవెళ్లలో మాత్రం మరో వైపు వీచాయి. 2008లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా వికారాబాద్ నియోజకవర్గంలో ఉన్న నవాబుపేట మండలాన్ని చేవెళ్లలో కలిపారు. అప్పటి వరకు జనరల్‌గా ఉన్న చేవెళ్ల అసెంబ్లీ స్థానం.. ఎస్సీకి రిజర్వుడ్ అయ్యింది. నవాబుపేట మండలంలో ఎస్సీ జనాభా అధికంగా ఉండటంతో నే.. చేవెళ్లను ఆ సామాజిక వర్గానికి కేటాయించారు. పునర్విభజన అనంతరం 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లో రాష్ట్రమంతా హస్తం హవా కొనసాగగా.. చేవెళ్లలో మాత్రం టీడీపీ అభ్యర్థి కేఎస్ రత్నం గెలిచారు.

కాంగ్రెస్ కంచుకోట..

నియోజకవర్గాల పునర్విభజనకు ముందు చేవెళ్ల కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేది. మాజీ మంత్రి ఇంద్రారెడ్డి, మాజీతాజా మంత్రి సబితారెడ్డిలకు తిరుగు ఉండేది కాదు. దీంతో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేవెళ్లను సెంటిమెంటుగా భావించే వారు. ఏ కార్యక్రమం చేపట్టినా అక్కడి నుంచే మొదలు పెట్టేవారు. అలాంటి సెగ్మెంట్‌ను ఎస్సీకి కేటాయించడంతో కాంగ్రెస్ కంచుకోటకు బీటలు వారాయి. తొలి సారిగా టీడీపీ అభ్యర్థి కేఎస్‌రత్నం .. కాంగ్రెస్ అభ్యర్థి కాలె యాదయ్యపై 2,250 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. అనంతరం కేఎస్ రత్నం టీడీపీకి రాజీనామా చేసి, 2014 సాధారణ ఎన్నికలకు మూడు నెలల ముందు టీఆర్‌ఎస్‌లో చేరారు. దాంతో నాటి అసెంబ్లీ ఎన్నికల్లో కేఎస్.. టీఆర్‌ఎస్ తరుపున పోటీ చేయగా.. కాలె రెండో సారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఈ సారి కూడా తెలంగాణ మొత్తం గులాబీ జెండా ఎగరగా.. చేవెళ్ల ప్రజలు మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి కాలె యాదయ్యను 681 ఓట్ల ఆధిక్యంతో గెలిపించారు.

కాంగ్రెస్ తరుపున ఎమ్మెల్యేగా గెలుపొందిన కాలె.. ప్రతి పక్షంలో ఉంటే నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిపోతుందని, నమ్మిన ప్రజలకు మేలు జరగదని భావించి బీఆర్‌ఎస్‌లో చేరారు.

2018లో ఇరువురు పోటీ

2018 ఎన్నికలకు ముందు వరకు కాలె యాదయ్య ఎమ్మెల్యేగా, కేఎస్ రత్నం టీఆర్‌ఎస్‌లో ఉన్నారు. మళ్లీ టీఆర్‌ఎస్ టికెట్ ఆశించిన రత్నంకు టికెట్ ఇవ్వకుండా, సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న యాదయ్యకే అధిష్టానం టికెట్ ఇచ్చింది. దాంతో కేఎస్ రత్నం టీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి, కాంగ్రెస్ నుంచి టికెట్ దక్కించుకొని బరిలోకి దిగారు. అయినా చేవెళ్ల ప్రజలు మరోసారి యాదయ్యకే పట్టం కట్టారు. దాంతో యాదయ్య మొదటగా కాంగ్రెస్ తరుపున, రెండోసారి టీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిపొందారు.

తుదితీర్పు ప్రజానికానిదే..

ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి కాలె యాదయ్య, బీజేపీ నుంచి కేఎస్ రత్నం, కాంగ్రెస్ నుంచి పామెన భీంభరత్ చేవెళ్ల బరిలో నిలిచారు. దీంతో త్రిముఖ పోటీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో గతంలో కాంగ్రెస్‌కు కంచుకోట అయిన చేవెళ్లపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ పెద్దలు పట్టుబట్టినట్లు తెలుస్తోంది. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన యాదయ్య మూడో సారి గెలిచేందుకు పట్టుదలతో ముందుకు వెళ్తున్నారు. ఈ సారి ఎలాగైనా గెలిచి తన సత్తా చాటాలని కేఎస్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఏది ఏమైనా.. తుదితీర్పు ప్రజానికానిదే. చేవెళ్ల బాద్ షాగా ఎవరిని నిలబెడతారో చూడాలి మరి..

అవ్వ ఓటు.. భలే హాటు!



వృద్ధురాలి వద్ద ఎన్నికల అధికారులు



ఓటు వేసిన నర్సమ్మ

- ఇంటికే తరలివచ్చిన అధికార యంత్రాంగం

కుల్కచర్ల: నిలువ నీడలేని ఓ వృద్ధురాలి ఓటుకోసం ఎన్నికల అధికార యంత్రాంగం కదిలి వచ్చింది. మూడు గోడల మధ్య తల దాచుకుంటున్న ఆ అవ్వ తన ఓటు హక్కును వినియోగించుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కుల్కచర్ల మండల కేంద్రానికి చెందిన సాలేటి నర్సమ్మ(86)కు ఎవరూ లేరు. ఒంటరిగా కాలం గడుపుతోంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈసీ నూతనంగా తీసుకువచ్చిన సంస్కరణలలో భాగంగా 80 సంవత్సరాలకు పై బడిన వృద్ధులకు ఇంటివద్దే ఓటు వేసే అవకాశం కల్పించింది. దీంతో గురువారం నర్సమ్మ ఇంటికి ఎన్నికల అధికారులు వచ్చి, ఆమెతో ఓటు వేయించారు. రోడ్డు విస్తరణలో కూల్చివేయగా మిగిలిన గోడల మధ్యే ఆమె జీవనం గడుపుతుండగా.. అక్కడ సరైన సౌకర్యం లేకపోవడంతో కారులో ప్రక్రియ ముగించారు. గురువారం ఒక్కరోజే ఇలా ఇంటి వద్దే ఉండి ఓటు వేసిన వారి సంఖ్య మండలంలో ఐదుకు చేరింది. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు పురందాస్, శ్రీనివాస్, మహేశ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ పద్మ, ఆశ కార్యకర్త సునిత పాల్గొన్నారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి



ఉపాధ్యాయ బృందంతో విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని రాష్ట్ర పీఆర్టీయూ అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు అనంతరెడ్డి అధ్యక్షతన స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ విద్యార్థులకు తొలి మెట్టు పాఠశాల అని చెప్పారు. గురువును మించిన దైవం లేదని సూచించారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఎస్సీ వర్గీకరణే ఎమ్మార్పీఎస్ లక్ష్యం

- ప్రధాని మోదీకే మా మద్దతు
- దేశంలో బీజేపీ గెలుపునకు కృషి
- పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

పరిగి: ఎస్సీ వర్గీకరణ కోసమే ఎమ్మార్పీఎస్ పుట్టిందని సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. బీజేపీ పరిగి అభ్యర్థి భూనేటి మారుతికిరణ్‌తో కలిసి ఆయన గురువారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ ఏ పార్టీకి అనుబంధం కాదన్నారు. కానీ ఎస్సీ వర్గీకరణ కోసం స్పష్టమైన హామీ ఇచ్చిన ప్రధాని కోసం, బీజేపీ విజయానికి పని చేస్తుందని ప్రకటించారు. బీసీలకు అత్యధిక సీట్లు ఇవ్వడంతో పాటు, సీఎం చేస్తానని ప్రకటించిన పార్టీ బీజేపీ ఒక్కటేనన్నారు. అందుకే ఆ పార్టీని గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. మాదిగ దండోరా ఏర్పాటు చేసిన ముప్పై ఏళ్ల చరిత్రలో తాము ఏ పార్టీ కండువా కప్పుకోలేదని, ఇప్పటివరకూ అదే నల్ల కండువాతోనే ఉన్నామని పేర్కొన్నారు.

అందరికోసం పోరాటం..

ఎమ్మార్పీఎస్ మాదిగలల కోసమే కాదని అన్ని కులాలు, మతాల అభ్యున్నతి కోసం పోరాడుతుందని మందకృష్ణ వెల్లడించారు. మా పోరాట ఫలితంగానే దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువచ్చారని స్పష్టంచేశారు. వికలాంగులకు పింఛన్, తెల్లరేషన్ కార్డు దారులకు బియ్యం కోటా పెంపు సాధ్యమైందని పేర్కొన్నారు. దేశ ప్రధానులెవరూ మాదిగల సభకు వచ్చిన సందర్భాలు లేవని, మోదీ స్వయంగా తమ సభకు హాజరై ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాటిచ్చారని స్పష్టంచేశారు. అధికారంలో ఉండి కూడా మాదిగలను పట్టించుకోని కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో, దేశంలో ఓడించాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉండి మా ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ఆమరణ దీక్ష చేస్తే నిమ్మరసం ఇచ్చింది నేను కాదా అని ప్రశ్నించారు. కేసీఆర్ మంత్రివర్గంలో మాదిగలకు చోటు కల్పించారా అని అడిగారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, బీజేపీ నాయకులు పెంటయ్య, రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ల కోసమే కాళేశ్వరం

- ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన ప్రభుత్వం
- జాతీయ నేతలను అవమానించిన వ్యక్తిని ఓడించాలి
- మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



తాండూరులో మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు: తెలంగాణలో తండ్రి, కొడుకు ప్రభుత్వాన్ని నడిపిస్తూ.. రాష్ట్రాన్ని ఆగం చేస్తున్నారని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం పట్టణంలోని భావిగి భద్రేశ్వర్ చౌక్ కూడలిలో బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి నేమూరి శంకర్‌గౌడ్ తరఫున ఎన్నికల ప్రచారం చేశారు. సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కొండా మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా ధనాన్ని మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టులో గుమ్మరించిందని, కమీషన్ల కోసమే ఆ జలాశయాన్ని నిర్మించిందని ఆరోపించారు. ఆ ప్రాజెక్టు ద్వారా ఒక్క ఎకరాకు నీరు అందలేదన్నారు.

తరిమికొట్టాలి..

బీజేపీ ప్రతిష్టను దెబ్బతీయడమే కాకుండా.. ప్రధాని నరేంద్రమోదీ చిత్ర పటంపై మసిపూసిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులను తరిమి కొట్టాలని కొండా పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేను కొనుగోలు చేసేందుకు బీజేపీ యత్నించిందని ఆరోపించిన వ్యక్తి, పైసకు కూడా అమ్ముడుపోడని.. అలాంటి వ్యక్తిని కొనేందుకు ఎవరూ ముందుకు రారని పరోక్షంగా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిపై ధ్వజమెత్తారు. బీజేపీ నేతలపై బురద జల్లేందుకు ఎమ్మెల్యేతో సీఎం కేసీఆర్ స్టింగ్ ఆపరేషన్ చేయించారని విమర్శించారు. ప్రధాని మోదీ, జాతీయ నేత బీఎల్ సంతోష్‌జీలను అవమానించిన ఎమ్మెల్యేను ప్రజలు ఓడించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఉమ్మడి జిల్లా చరిత్రలో ఇలాంటి దిగజారిన ఎమ్మెల్యేను ఇక్కడే చూస్తున్నామన్నారు. ఇతర నియోజకవర్గాల్లో మార్పు కనిపిస్తోందని, కాని ఇక్కడ పదేళ్లుగా ఎలాంటి మార్పు లేదన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, నాయకులు ఉన్నారు.

అధికారం ఇస్తే.. సబ్ స్టేషన్లు అమ్మేస్తాడు

వికారాబాద్ అర్బన్: బీఆర్‌ఎస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ఎట్టి పరిస్థితిల్లోనూ ఆ పార్టీ అధికారంలోకి రాదని బీజేపీ సీనియర్ నాయకుడు, చేవెళ్ల మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. ఎన్నికల పర్యటనలో భాగంగా ఆయన వికారబాద్‌లో ఆ పార్టీ అభ్యర్థి నవీన్ కుమార్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ మోసాలు ఇప్పుడిప్పుడే ప్రజలకు తెలుస్తున్నాయని చెప్పారు. కేసీఆర్.. 24 గంటల విద్యుత్ నేనే ఇస్తున్నట్లు ప్రకటించుకుంటున్నారు. కానీ అందుకు కేంద్రం ఎన్ని నిధులు ఇస్తుందో చెప్పడం లేదని మండిపడ్డారు. కరెంట్ సరఫరాకు రాష్ట్రం వాటా చెల్లించలేక.. ట్రాన్స్‌కో ఆస్తులను తాకట్టుపెట్టారని ఆరోపించారు. మరోసారి కేసీఆర్‌కు అధికారం ఇస్తే.. విద్యుత్ సబ్ స్టేషన్లను అమ్మేస్తాడని పేర్కొన్నారు. చేశారు. ఇందులో పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానంద్ రెడ్డి, అభ్యర్థి నవీన్ కుమార్ తదితరులు ఉన్నారు.

యంగ్ తరంగ్ !

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో యంగ్ తరంగ్ ఓటు అనే వజ్రాయుధంతో దూసుకొస్తోంది. ఈ నెల 30న జరగనున్న శాసనసభ ఎన్నికలలో తొలిసారి ఓటు వేసేందుకు యువతరం ఉరకలేస్తోంది. వీరు ఎటు మొగ్గు చూపితే ఆ అభ్యర్థులే విజయం సాధిస్తారనడంలో సందేహం అక్కర్లేదు. అభ్యర్థులు నచ్చకపోతే నోటాను నొక్కే అవకాశం ఉండటంతో అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది. ఉద్యోగ అవకాశాలు, మౌలిక వసతుల అభివృద్ధే వీరి ప్రధాన ఎజెండా. దీంతో వీరిని ఆకట్టుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు సామాజిక మాధ్యమాల వేదికగా తెగ ప్రచారం చేస్తున్నాయి.

గ్రేటర్‌లో 1.70 లక్షల మంది ఓటర్లు..

రాష్ట్రంలో 18–19 ఏళ్ల మధ్య వయసు ఉన్న యువ ఓటర్లు 8,11,640 మంది ఉన్నారు. ఇందులో గ్రేటర్ వాటా 1.70 లక్షలు. అత్యధికంగా రంగారెడ్డిలో 92,540, హైదరాబాద్‌లో 77,522 మంది యువత రానున్న అసెంబ్లీ ఎన్నికలలో తొలిసారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. గ్రేటర్‌లోని చాలా నియోజకవర్గాలలో ఈ తొలి ఓట్లే అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో కీలకంగా మారాయి.

ఉచిత విద్య, వైద్యానికే మొగ్గు..

మౌలిక సదుపాయల అభివృద్ధి, ఉద్యోగ అవకాశాల, జాబ్ కేలండర్‌లకు మేనిఫెస్టోలో ప్రాధాన్యం ఇచ్చిన పార్టీలకే యువతరం మొగ్గు చూపించే అవకాశాలున్నాయి. దీంతో పాటు ఉచిత విద్య, వైద్యం కల్పించే పార్టీలకు జైకొడతామని పేర్కొంటున్నారు. ప్రజాధనం దుర్వినియోగం, స్కామ్‌లు, అవినీతి వంటి వాటిపై సామాజిక మాధ్యమాల వేదికగా ప్రశ్నిస్తున్నారు. ఈ యువ ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. బస్తీలు, కాలనీల్లోని యువ ఓటర్లను ఆకర్షించేందుకు క్రికెట్ కిట్లు, యువతుల కోసం రకరాల కానుకలు పంపిణీ చేస్తున్నారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే ఇండ్లు

- రెండుసార్లు సీఎం అయినా ఒక్క ఇళ్లు ఇవ్వని కేసీఆర్
- కాంగ్రెస్ వికారాబాద్ అసెంబ్లీ అభ్యర్థి ప్రసాద్‌కుమార్



మాట్లాడుతున్న మాజీమంత్రి ప్రసాద్‌కుమార్

ధారూరు: ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు న్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ అసెంబ్లీ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన గురువారం మండల పరిధి నాసగ్‌సాన్‌పల్లి, తరిగోపుల, మైలారం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో అర్హులకు ఏడాదికి కనీసం వంద ఇళ్లు ఇచ్చే వారని, రెండుసార్లు సీఎం అయిన కేసీఆర్.. ఏ ఒక్కరికీ డబుల్ బెడ్‌రూం ఇవ్వలేదని మాజీమంత్రి ఆరోపించారు. ధరణిలో కాస్తు కాలం తీసేసి, జాగీర్దార్లు, నవాబుల భూములను లాక్కుంటున్నారని విమర్శించారు. పేదల సీలింగ్, లావుని పట్టా భూములను గుంజుకొని అన్యాయం చేశారని మండిపడ్డారు. మళ్లీ అధికారం వస్తుందనే అత్యాశతో ముందుగానే ఆర్టీసీ ఆస్తులను అమ్ముకునేందుకు కేసీఆర్ ప్రణాళిక సిద్ధం చేసుకున్నారని తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సకల జనులకు మేలు జరుగుతుందని చెప్పారు. కావున చేతి గుర్తుకు ఓటువేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పట్లోళ్ల రాములు, నాయకులు పాండునాయక్, గఫార్, మమ్మద్ బాబాఖాన్, కిషోర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిని పట్టించుకోని ప్రభుత్వం

- సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే విఫలం
- నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం
- కాంగ్రెస్ కల్వకుర్తి అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి



పార్టీలో చేరిన వారితో కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కల్వకుర్తి అన్ని రంగాల్లో వెనుకబడిందని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ కల్వకుర్తి అసెంబ్లీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఎన్నికల పర్యటనలో భాగంగా ఆయన గురువారం మండల పరిధి చిన్న వేములోని బావితండా, పెద్దావేములోని బావితండా, మైసిగండి, గడ్డమీదితండా, వెలుగురాళ్ల తండాల్లో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, వైఎస్‌ఆర్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్జున్‌రెడ్డిలతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రస్తుత ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కల్వకుర్తిని పట్టించుకోలేదని, మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన.. నియోజకవర్గంలో నెలకొన్న సాగునీటి సమస్య తీర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయలేదని, విద్యావైద్యాన్ని విస్మరించారని విమర్శించారు.

ఇందిరమ్మ రాజ్యం

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని కసిరెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ గెలిస్తే.. ఇందిరమ్మ రాజ్యం వస్తుందని, అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాలతో పాటు, మేనిఫెస్టోలో పొందుపరచిన స్కీంలు అమలు అవుతాయని పేర్కొన్నారు. శ్రీనివాస్‌గౌడ్, అర్జున్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజా సమస్యలను ఏమాత్రం పట్టించుకోలేదని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని, ఈ అసెంబ్లీ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటువేసి పార్టీని గెలిపించాలని కోరారు. ఇదిలా ఉండగా.. మైసిగండిలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన 150 మంది కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, గిరిజన సేవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, నాయకులు జహంగీర్‌అలీ, యాదగిరిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ పాండునాయక్, వినోద్, హీరాసింగ్, అమర్‌సింగ్, కిషన్, శేఖర్‌గౌడ్, జవహర్‌లాల్, గోపి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

నేడు కందుకూరులో మంత్రి సబిత ప్రచారం

కందుకూరు: కందుకూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం మంత్రి సబితా రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని జెడ్పీటీసీ జంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటలకు నేదునూరుతో ప్రారంభమై దాసర్లపల్లి, దాసర్లపల్లితండా, సాయిరెడ్డిగూడ, ముచ్చర్ల, సార్లరావులపల్లి, దెబ్బడగూడ, కందుకూరులో ప్రచారం చేస్తారు. బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

బ్యాంకులకు వరుస సెలవులు

వికారాబాద్ అర్బన్: బ్యాంకులకు వరుస సెలవులు ఉన్నందున ఈ నెల 28వ తేదీ మాత్రమే గ్రామీణ బ్యాంక్ ఖాతాదారులు తమ లావాదేవీలను నిర్వహించుకోవాలని జిల్లా లీడ్ బ్యాంకు అధికారి రాంబాబు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో వరుసగా ప్రభుత్వ సెలవులు ఉన్నట్లు తెలిపారు. 29, 30 తేదీల్లో బ్యాంక్ సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటారని, ఈ రెండు రోజులు బ్యాంకు పని చేయదని తెలిపారు. కావున ఖాతాదారులు 28వ తేదీ తమ లావాదేవీలు నిర్వహించుకోవాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ సెలవు దినాలు తప్ప, మిగతా అన్ని రోజుల్లో బ్యాంకులు యథావిధిగా పనిచేస్తాయని తెలిపారు. ఖాతాదారులు సహకరించాలని కోరారు.

జాతీయ పోటీలకు ఎంపిక

పహాడీషరీఫ్: జనవరి–2024లో జరిగే జాతీయ ఐస్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు రంగారెడ్డి జిల్లా మామిడిపల్లికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ కుమార్తె ఈరంకి చాణస్యగౌడ్ ఎంపికయ్యింది. ఐస్ స్కేటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గత నెల గురుగ్రామ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ ఐస్ స్కేటింగ్‌లో చాణస్య అండర్–9 విభాగంలో పోటీచేసి షార్ట్ బ్లేడ్‌లో రజతం సాధించింది. ఆమె ప్రతిభను గుర్తించిన నిర్వాహకులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.